# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 2-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 202 | పేజీలు:4 | వెల: రూ.1/-


## మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ సదస్సు ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 1:రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానం అందింది. తమ సదస్సులో ప్రసంగించాలని అమెరికాకు చెందిన మిల్కెన్ ఇన్స్టిట్యూట్ కేటీఆర్‌కు ఆహ్వానం పంపింది. లాస్ ఏంజిల్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు మిల్కెన్ ఇన్స్టిట్యూట్ 25వ వార్షిక సదస్సు జరగనుంది. సెలబ్రేటింగ్ ద పవర్ ఆఫ్ కనెక్షన్ పేరుతో సదస్సును నిర్వహించనున్నారు.

ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానించినందుకు మిల్కెన్ ఇన్స్టిట్యూట్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కరోనా తర్వాత ప్రపంచ ప్రముఖులను కలిసేందుకు ఇది మంచి వేదిక అని కేటీఆర్ పేర్కొన్నారు.






## ప్రధానమంత్రి 'పరీక్ష పే చర్చ'లో పాల్గొన్న గవర్నర్



హైదరాబాద్, ఏప్రిల్ 1:మానసిక ప్రశాంతతకు, నాణ్యమైన అధ్యయనానికి విశ్రాంతితో పాటు చదువును సాగించే ప్రయత్నం చేయడం చాలా ముఖ్యమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మానసికంగా దృఢంగా, ధైర్యంగా ఉండాలని ఆమె కోరారు.

శుక్రవారం రాజ్‌భవన్‌లోనిలో జరిగిన ప్రధానమంత్రి ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ పరీక్ష పే చర్చా 5వ ఎడిషన్‌లో ఆమె వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి వర్చువల్ గా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ 'పరీక్ష పే చర్చ' కార్యక్రమం ప్రధానమంత్రి ద్వారా జరుగుతున్న ఒక మంచి కార్యక్రమమని అన్నారు.

రాబోయే బోర్డు, ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు మానసికంగా ప్రశాంతంగా హాజరయ్యేలా చూడాలనే లక్ష్యంతో విద్యార్థులతో ప్రధాన మంత్రి సంభాషించారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న ప్రయత్నమని అన్నారు.

ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఏర్పడేలా పర్యావరణాన్ని సృష్టించడానికి ఇది ఒక ప్రత్యేక కార్యక్రమమని ఆమె అన్నారు.

విద్యార్థులతో మమేకమై ఆత్మవిశ్వాసాన్ని నింపినందుకు ప్రధానమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు తమను తాము సిద్ధం చేసుకోవాలని తమిళిసై సౌందరరాజన్ విద్యార్థులకు ఉద్బోధించారు.

విద్యార్థులు ప్రధాని సలహాలను పాటించాలని, భయాందోళనలకు దూరంగా ఉండి, పరీక్షలకు హాజరు కావాలని ఆమె కోరారు.'మీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి తద్వారా మీరు పరీక్షలలో చదివినవన్నీ గుర్తుకు తెచ్చుకోగలుగుతారు' అని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన దాదాపు 120 మంది విద్యార్థులు, రంగారెడ్డి జిల్లా నల్లగండ్ల జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రాజ్‌భవన్‌లో విద్యార్థులందరికీ ప్రధానమంత్రి "ఎగ్జామ్ వారియర్స్" తెలుగు అనువాదాన్ని అందించారు.

## రష్యాపై ఉక్రెయిన్ తొలి వైమానిక దాడి ఇంధన డిపోపై బాంబులు

మాస్కో, ఏప్రిల్ 1: ఉక్రెయిన్ తమ భూభాగంలోని తొలి వైమానిక దాడి చేసిందని రష్యా ఆరోపించింది. బెల్గోరోడ్ నగరంలోని ఇంధన డిపోపై హెలికాప్టర్లతో బాంబు దాడి చేసినట్టు పేర్కొంది. ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలకు ఇది ఆటంకం కలిగించవచ్చని హెచ్చరించింది. ఉక్రెయిన్ సరిహద్దుకు 40 కిలోమీటర్ల దూరంలోని బెల్గోరోడ్ లో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగినట్టు రష్యా తెలిపింది. రష్యా భూభాగంలోకి ప్రవేశించిన ఉక్రెయిన్ ఆర్మీ హెలికాప్టర్ అక్కడి పెట్రోల్ నిల్వ కేంద్రంపై బాంబు దాడులు చేసిందని ఆరోపించింది. దీంతో భారీగా మంటలు ఎగసిపడినట్టు బెల్గోరోడ్ ప్రాంత గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ పేర్కొన్నారు. 170 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసినట్టు చెప్పారు. ఇంధన డిపోలో పని చేసే ఇద్దరు ఉద్యోగులు మంటల్లో గాయపడినట్టు టెలిగ్రామ్ ద్వారా వెల్లడించారు. సిబ్బందిని అక్కడి నుంచి వెంటనే ఖాళీ చేయించినట్టు రష్యా మంత్రిత్వశాఖ పేర్కొంది.

ఉక్రెయిన్‌పై రష్యా దాడి శుక్రవారంతో 37వ రోజుకు చేరుకుంది. ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్‌ను పూర్తిగా ధ్వంసం చేసినట్టు రష్యా ఇటీవల పదేపదే ప్రకటించింది. ఈ నేపథ్యంలో రష్యా భూభాగంలోని ఇంధన డిపోపై ఉక్రెయిన్ వైమానిక దాడి జరపడం ప్రాధాన్యత సంతరించుకున్నది. కాగా, ఇరు దేశాల మధ్య జరుగుతున్న శాంతి చర్చలకు ఇది విఘాతం కలిగించవచ్చని రష్యా ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మీడియాతో అన్నారు.

మరోవైపు రష్యా కుతంత్రాలకు పాల్పడుతున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఒకవైపు చర్చలంటూనే మరోవైపు దాడులను తీవ్రం చేస్తున్నదని విమర్శించారు. తాము తరిమికొడుతున్న ప్రాంతాలను వీడుతున్న రష్యా దళాలు కీలకమైన మిగతా ప్రాంతాలపై దృష్టిసారిస్తున్నాయని తెలిపారు. దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో పరిస్థితి చాలా కష్టంగా ఉందన్నారు. ఖార్కివ్, డాన్‌బాస్, మరియుపోల్ ప్రాంతాల్లో రష్యా దళాలు పెద్ద స్థాయిలో మోహరించాయని, దాడులను తీవ్రం చేస్తున్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో రష్యా దళాలను ఎదుర్కోవడం ఉక్రెయిన్‌కు చాలా కష్టమన్నారు.

## వెన్నెల సాహితీ పురస్కారానికి యార్లగడ్డ 'పచ్చికడుపు వాసన' ఎంపిక




హైదరాబాద్, ఏప్రిల్ 1: ప్రముఖ కవి యార్లగడ్డ రాఘవేంద్రరావు పుస్తకం 'పచ్చి కడుపు వాసన' వెన్నెల సాహితీ పురస్కారం 2021 సంవత్సరానికి ఎంపికైంది. వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో ఏటా ఈ పురస్కారం అందిస్తారు. వివిధ రాష్ట్రాల్లోని తెలుగు కవులు రచించిన 70 కవితా సంపుటులు పోటీకి ఎంపికవగా, న్యాయ నిర్ణేతలు 'పచ్చి కడుపు వాసన'ను పురస్కారానికి ఎంపిక చేశారని వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి తెలిపారు. యార్లగడ్డ రాఘవేంద్రరావు 13 సంవత్సరాలుగా 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పేరుతోనే శుభాలను మోసుకొస్తున్న 'శుభకృత్' నామ సంవత్సరం ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ కృషి, దైవకృపతో పుష్కలమైన నీరు, పచ్చని పంటపొలాలతో తెలంగాణ అలరారుతున్నదని సీఎం ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఉగాది నుంచే నూతన సంవత్సరం ఆరంభమవుతుందని, తమ వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుంచే ప్రారంభించుకుంటారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీరు, వ్యవసాయ రంగాలకు అత్యధికంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని తెలిపారు. రైతన్నల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నది దేశంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనన్నారు.

వ్యవసాయ రంగంలో తెలంగాణ అనతికాలంలోనే దేశం గర్వించేలా కనీవినీ ఎరుగని అభివృద్ధిని సాధించిందని సీఎం అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అనుబంధ వృత్తులు బలపడి తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని, వ్యవసాయం బాగుంటేనే సర్వ జనులు సంతోషంగా ఉంటారనే సూక్తిని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్నదన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ తెలంగాణ వ్యవసాయ రంగం దేశ జీడీపీకి దోహదపడడంలో ముందున్నదన్నారు. తెలంగాణ ఉత్పత్తి సేవా రంగాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవ్వడంలో.. వ్యవసాయ రంగం పరోక్ష పాత్రను పోషిస్తుందని సీఎం పేర్కొన్నారు. అనతి కాలంలోనే అన్ని రంగాలను పటిష్టపరుచుకున్నామనీ, 'శుభకృత్ నామ సంవత్సరంలో తెలంగాణ మరింత గొప్పగా అభివృద్ధి సాధించనున్నదని అన్నారు. అభివృద్ధిలో దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందని సీఎం కేసీఆర్ తెలిపారు.

## తుర్క్ మెనిస్తాన్ లో భారత రాష్ట్రపతి 'రామ్ నాథ్ కోవింద్' పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:34 ఏళ్ల తర్వాత తుర్క్‌మెనిస్తాన్‌లో భారత రాష్ట్రపతి పర్యటించారు .. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నెదర్లాండ్స్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ శుక్రవారం తుర్క్‌మెనిస్తాన్ మరియు నెదర్లాండ్స్‌లో ఏడు రోజుల పర్యటనకు బయలుదేరారు. తుర్క్‌మెనిస్తాన్ ఏర్పడి 30 ఏళ్లు పూర్తయ్యాయి.. ఈ సంవత్సరం భారతదేశం.. తుర్క్‌మెనిస్తాన్‌ల మధ్య దౌత్య సంబంధాలకు మూడు దశాబ్దాల గుర్తుగా మిగిలింది. తుర్క్‌మెనిస్తాన్‌కు కొత్తగా నియమితులైన అధ్యక్షుడికి ఇది మొదటి అతిపెద్ద ఇన్‌కమింగ్ సందర్శన అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశం .. తుర్క్‌మెనిస్తాన్ సంయుక్త ప్రకటనను విడుదల చేయనున్నాయి.. విపత్తు నిర్వహణ, ఆర్థిక మేధస్సు, సహకారం మరియు సంస్కృతి .. యువజన వ్యవహారాలపై అవగాహన ఒప్పందాలను కూడా కలిగి ఉంటాయి.. భారతదేశం .. నెదర్లాండ్స్ మధ్య 75 సంవత్సరాల దౌత్య సంబంధాలను గుర్తు చేస్తూ, నెదర్లాండ్ రాజు విలియం అలెగ్జాండర్ మరియు క్వీన్ మాక్సిమా ఆహ్వానం మేరకు రాష్ట్రపతి కోవింద్ నెదర్లాండ్స్ పర్యటన ఏప్రిల్ 4-7 వరకు ఉంటుంది. అక్టోబర్ 2019లో రాజ దంపతులు భారతదేశాన్ని సందర్శించిన తర్వాత భారతదేశం నుండి ఇది మొదటి ఉన్నత స్థాయి పర్యటన.

34 సంవత్సరాల క్రితం 1988లో అప్పటి రాష్ట్రపతి వెంకటరామన్ ఆ దేశాన్ని సందర్శించినప్పుడు భారతదేశం నుండి నెదర్లాండ్స్‌కు చివరిసారిగా రాష్ట్రపతి పర్యటన జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ 2017లో నెదర్లాండ్స్‌లో పర్యటించారు. 2021 ఏప్రిల్‌లో జరిగిన ఇండియా నెదర్లాండ్స్ వర్చువల్ సమ్మిట్‌ను అనుసరించి రాష్ట్రపతి పర్యటన ఉంది, ఇక్కడ నీటిపై వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించడానికి, పెట్టుబడి సులభతరం కోసం ద్వైపాక్షిక ఫాస్ట్ ట్రాక్ మెకానిజంను ఏర్పాటు చేయడానికి మరియు వ్యవసాయంలో 25 ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ? 2025 నాటికి సంబంధిత రంగాలు. ఓడరేవులు, రాష్ట్ర ఆర్కైవ్‌లు, సాంస్కృతిక మార్పిడి, అలాగే సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంపై అవగాహన ఒప్పందాలు సంతకాలు చేయబడతాయి" అని ఓఇం తెలిపింది. ఈ పర్యటనలో రాష్ట్రపతి వెంట మత్స్య, పశుసంవర్ధక, సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్, పార్లమెంటు సభ్యుడు దిలీప్ ఘోష్ ఉన్నారు.

## శుభాలను ఇచ్చే సంవత్సరం 'శుభకృత్'

హైదరాబాద్, ఏప్రిల్ 1:: గత రెండేళ్లుగా కరోనా కష్టాలు పడుతున్న ప్రజలకు శుభాలను ఇచ్చే శుభకృత్ నామ సంవత్సరం వచ్చిందని, కష్టాల నుంచి బయటపడి ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలని గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడా అమలు కాని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణలో కొనసాగుతున్నాయని, వీటి ఫలితాలు ప్రజల కళ్లముందు ఉన్నాయన్నారు.

సీఎం కేసీఆర్ ఈ శుభకృత నామ సంవత్సరాన్ని సార్ధక నామ సంవత్సరంగా చేసేందుకు 80,039 ఉద్యోగాలను భర్తీ చేస్తూ 11,103 కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించారని తెలిపారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## పండగల విషయంలో ప్రభుత్వం అన్నివర్గాలకు సమన్యాయం: ఎర్రబెల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 1:¯పండగల విషయంలో తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలకు, మతాలకు సమాన న్యాయం చేస్తున్నదని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.పండుగల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలు, మతాలను దృష్టిలో పెట్టుకొని సామరస్య నిర్ణయాలు తీసుకొంటుదన్నరు. ఏప్రిల్ 2న ఉగాది పర్వదినాన్ని ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. రెండు సంవత్సరాలు కరోనాతో బాధపడుతున్న ప్రజలకు ఇప్పుడు కొంత విముక్తి లభించిందన్నారు. శుభకృత్ నామ సంవత్సరంలో సబ్బండ వర్గాలు, సంతోషాలు, మానవతా విలువలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు

## గవర్నర్ ను కలిసిన రెడ్ క్రాస్ ఛైర్మన్ అజయ్ మిశ్రా



హైదరాబాద్, ఏప్రిల్ 1:రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ఛైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, వివిధ జిల్లాల రెడ్ క్రాస్ ఛైర్మన్లు, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు శుక్రవారం రాజభవన్ లో గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ ను మర్యాద పూర్వకంగా కలిసి రెడ్ క్రాస్ కార్యక్రమాల పై చర్చించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్రహ్మాండంగా సేవలు అందచేశారని ప్రశంసించారు. ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సంపాదించాలని తెలిపారు. అదేవిధంగా జనరిక్ షాపులను పేద ప్రజల కొరకు అందుబాటులో ఉంచాలని కోరారు. జూనియర్, యూత్ రెడ్ క్రాస్ ను బలోపేతం చేయాలన్నారు. అలాగే వరంగల్, హనుమకొండలో మాదిరిగా తలసీమియా పిల్లలను గుర్తించాలని అన్నారు, వారి కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో హనుమకొండ జిల్లా నుండి రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్ రావు పాల్గొని హనుమకొండ రెడ్ క్రాస్ యాక్టివిటీస్ రిపోర్ట్ ను ఛైర్మన్ కు అందచేసినారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర వైస్ ఛైర్మన్ సురేంద్ర మోహన్,జనరల్ సెక్రటరీ కె. మదన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధర.. ఒకేసారి రూ.273.5 వడ్డింపు

మాస్కో, ఏప్రిల్ 1:చమురు ధరల మోత ఇప్పట్లో ఆగేలా లేదు. నిన్నటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన దేశీయ చమురు కంపెనీలు.. ఇప్పుడు వాణిజ్య అవసరాలకోసం వినియోగించే సిలిండర్‌పై భారీగా వడ్డించాయి. ఒకేసారి రూ.273.5 పెంచాయి. దీంతో హైదరాబాద్ కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2460కి చేరింది.

ఇక దేశరాజధాని న్యూఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.250 పెరిగింది. దీంతో రూ.2253కు చేరింది. అయితే ప్రస్తుతానికి గృహ అవసరాలకోసం వినియోగించే 14 కిలోల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకపోవడం కొంతలో కొంత ఊరటనిస్తున్నది. కాగా, గతనెల 1న 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను రూ.105 మేర పెంచిన విషయం తెలిసిందే.

### 10 రోజుల్లో రూ.7 వడ్డన

మార్చి 22 నుంచి గత పదిరోజుల్లో తొమ్మిది సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు అధికమయ్యాయి. మొత్తంగా లీటర్ పెట్రోల్‌పై రూ.7.22, లీటర్ డీజిల్‌పై రూ.6.96 చొప్పున ధరలు పెరిగాయి. దీంతో హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.115.42, డీజిల్ రూ.101.58గా ఉంది. కాగా, గత నెలలోనే గృహావసరాలకు వినియోగించే సిండర్ ధర రూ.50 పెరిగిన సంగతి విధితమే.

## యూజీ ఆయూష్ సీట్ల ఖాళీల భర్తీకి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 1:కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, వరంగల్ : యూజీ ఆయూష్ సీట్ల ఖాళీల భర్తీకి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. యూజీ 'నీట్' ఆయూష్ కటాఫ్ స్కోర్ ను 5% తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు క్వాలిఫయింగ్ కటాఫ్ జనరల్ కేటగిరీ 45వ పర్సెంటైల్, దివ్యాంగులు (జనరల్)కు 40, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వుడ్ కేటగిరీలకు 35 పర్సెంటైల్‌గ నిర్ణయించారు.

కటాఫ్ మార్కులు తగ్గడంతో ఇందుకనుగుణంగా అర్హులైన అభ్యర్థులు బీహెచ్‌ఎంఎస్, బీఏఎంఎస్, బీఎన్‌వైఎస్, బీయూఎంఎస్ కన్వీనర్ కోటా అలాగే బీహెచ్‌ఎంఎస్ యాజమాన్య కోటాలలో దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరోసారి ప్రవేశ ప్రకటనలను జారీ చేసింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కన్వీనర్, యాజమాన్య కోటాలకు విడివిడిగ దరఖాస్తు చేసుకోవాలిసి ఉంటుంది.తగ్గిన కటాఫ్ స్కోర్ ఆధారంగా అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 2న ఉదయం 8 గంటల నుంచి 3న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు సంబంధిత ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది . దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. మరిన్ని వివరాలకు www.knruhs.telangana.gov.inని వెబ్‌సైట్‌ను చూడాలని యూనివర్సిటీ వర్గాలు సూచించాయి.

## ఎంత బియ్యాన్ని కొంటారో చెప్పండి: ఎంపీ కేశవరావు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: తెలంగాణ నుంచి కేంద్రం ఎంత బియ్యాన్ని కొంటుందో స్పష్టం చేయాలని ఇవాళ ఎంపీ కేశవరావు డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణ గురించి ఎన్నో సార్లు చర్చించామని మంత్రి అంటున్నారని, కానీ ఆయన ప్రతిసారి కన్ఫ్యూజ్ చేస్తున్నారని టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు అన్నారు. డీసెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్ (డీసీపీ) విధానంలో ధాన్యం సేకరిస్తున్న రాష్ట్రాల నుంచి కేంద్రం ధాన్యం కొంటుందా లేదా అని ఆయన ప్రశ్నించారు.

డీసెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్‌లో భాగంగా రాష్ట్రమే నేరుగా ధాన్యం కొని మిల్లింగ్ తర్వాత ఎఫ్‌సీఐకి ఇస్తుందన్నారు. కానీ ధాన్యం కొనుగోలు సమయంలో జూన్ నెలలోనే మేం డబ్బులు చెల్లిస్తామని, కేంద్రం మాత్రం ఆగస్టులో ఆ అమౌంట్ ఇస్తుందని కేశవరావు అన్నారు. తమ వద్ద నుంచి ఎంత మొత్తంలో బియ్యాన్ని కొనుగోలు చేస్తారో కేంద్రం స్పష్టంగా చెప్పాలని ఆయన అడిగారు. కేంద్ర ఆహార శాఖ తన లేఖల్లో కానీ ఒప్పందాల్లో కానీ వరి గురించి చెప్పిందని, కానీ ఎక్కడా బియ్యం అన్న పదాన్ని వాడలేదన్నారు. తెలంగాణలో భిన్న వెరైటీ ధాన్యం ఉంటుందని, ఒడిశాలో మరో రకంగా ఉంటుందని ఆయన అన్నారు. ఆ వెరైటీలతోనే బాయిల్డ్ రైస్ తయారు అవుతుందని ఎంపీ కేశవరావు అన్నారు.

## స్కూల్ నుంచి ఇంటికొచ్చిన బాలిక.. ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య

హైదరాబాద్, ఏప్రిల్ 1: ఓ విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లోని జీడిమెట్లలో చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వి.ఆంజనేయులు 15 సంవత్సరాలక్రితం హైదరాబాద్‌కు వచ్చి కుత్బుల్లాపూర్ రాజీవ్ గాంధీ నగర్ లో ఉంటూ వెల్డింగ్ వర్క్ చేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు తరంగిని (13), తుల్లిక(10) స్థానికంగా ఉండే సిరి ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ లో చదువుతున్నారు. రోజులాగే నిన్న ఉదయం పిల్లలను స్కూల్‌కు పంపి ఆ తరువాత భార్యభర్తలు పనికి వెళ్లారు. అయితే చిన్నఅమ్మాయి స్కూల్ అవ్వగానే మధ్యాహ్నం ఇంటికి వచ్చి పక్కనే ఉన్న మేనమామ ఇంటికి ఆడుకునేందుకు వెళ్లింది.

పెద్ద అమ్మాయి సాయంత్రం స్కూల్ అవ్వగానే 4 గంటలకు ఇంటికి వచ్చింది. ఆడుకోవడానికి వెళ్లిన చిన్న అమ్మాయి 4.30 గంటలకు వచ్చి తలుపుకొట్టగా ఎంతకు తీయకపోవడంతో సహాయం కోసం పక్కింటి వారిని పిలిచింది. ఎంతకూ డోర్ తీయకపోవడంతో బద్దలుకొట్టి తీయగా సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించింది. వెంటనే సూరారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు చెప్పారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా ఆసుపత్రికి వచ్చారు. అనంతరం జీడిమెట్ల పోలీస్ లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ కె.బాలరాజు తెలిపారు.

## పటాన్‌చెరులో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి, ఏప్రిల్ 1:: పటాన్‌చెరు పట్టణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుద్యోగులు పోటీ పరీక్షలకు కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదహారు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని విమర్శించారు. వెంటనే అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యగులు డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఏ మొహం పెట్టుకొని పాదయాత్ర చేస్తారని ప్రశ్నించారు. కేంద్రం వడ్లు కొనుగోలు పైన సంజయ్ రైతులకు సమాధానం చెప్పాలన్నారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ పలు విధముల శుభముల నిడి
పలు విధముల వరముల నిడి వరదాయినియై
యులరుత 'శుభకృతు' వర్షము
తెలుగుల వెలుగులను దెలుపు తేజమ్ముప్పన్

(ఏప్రిల్ 2 శుభకృతు ఉగాది...)



–రాధశ్రీ

సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# పుస్తకం వ్యక్తిత్వ వికాస సాధనం

## (ఏప్రిల్ 2 'అంతర్జాతీయ బాలల పుస్తక దినం' సందర్భంగా)

పుస్తకం హస్తభూషణమే కాదు, మేధో వికాస సాధనం కూడా. పుస్తకాలు విజ్ఞాన గనులు. పుస్తక పఠనమే జ్ఞాన సమపార్జనకు ఉత్తమ మార్గం. పిల్లలు, పెద్దలు పుస్తక పఠనాన్ని విధిగా అలవాటు చేసుకోవాలి. చిరుప్రాయంలోనే పిల్లల్లో పఠనాసక్తిని పెంచడానికి బాలల పుస్తకాలు ఉపయోగపడతాయి. బాలల్లో ఊహాశక్తిని పెంచడం, విజ్ఞాన సమపార్జన, వ్యక్తిత్వ వికాసం, వినోదాల విందు వడ్డించడం, మేధో విస్తృతి, వివేక సంపదలను ప్రసాదించే శక్తివంతమైన నేస్తం పుస్తకమని మరువరాదు. ఆసక్తికరమైన పంచరంగుల బాలల పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచి, వారిలో పఠనాసక్తిని జాగృతం చేయడం మనందరి కర్తవ్యం. పుస్తక పఠనంతో మె?దలైన బాలల విజ్ఞాన సమపార్జన యాత్రలో రేపటి బాధ్యతగల నైపుణ్య సంపద కలిగిన పౌరులుగా నిర్మింపబడతారనే సదుద్దేశంతో 1967 నుంచి ప్రతి ఏటా 02 ఏప్రిల్ రోజున 'అంతర్జాత బాలల పుస్తక దినం' ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 'ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్' సంస్థ సౌజన్యంతో బాలల పుస్తకాల రచయిత 'హన్స్ క్రిస్టియన్ ఆండర్సన్' పుట్టిన రోజున బాలల పుస్తక వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుట జరుగుతుంది.

అంతర్జాతీయ బాలల పుస్తక దినం వేదికగా బాలల పుస్తక రచయితలను గుర్తించడం, పిల్లల్లో పుస్తక పఠనాసక్తిని రగల్చడం, విద్యసమపార్జన, వ్యక్తిగత మానసికాభివృద్ధి, మెదడుకు వ్యాయామం, పారిభాషక పదకోశవృద్ధి, సంతులిత ఆలోచనలు జనింపజేయడం, సహానుభూతిని మేల్కొలపడం, ఊహాశక్తిని విస్తరించడం, మానవీయ విలువల్ని పరిచయం చేయడం, ప్రపంచ వింతలు/విడ్డూరాలను సరళభాషలో అవగాహన పరచడం లాంటి కార్యక్రమాలను బాలల కోసం నిర్వహించాలి. ఆసక్తికర, ఆనందానుభూతుల విషయ విందులను చిన్నారులకు వడ్డించే సామర్థ్యం బాలల పుస్తకాలకు మాత్రమే ఉంటుంది. కథలు, కార్టూన్లు, డ్రాయింగ్ పుస్తకాలను చదవడానికి పిల్లలు ఎక్కువ మక్కువ చూపుతారు. ఈ పుస్తక పఠనం అలవాటుగా మారుతూ, శారీరక ఎదుగుదలతో పాటు మానసిక సమతుల వికాసం ఫలిస్తుంది.

అంతర్జాతీయ బాలల పుస్తక దినం-2022 నినాదంగా 'ది స్మాల్ ఈజ్ బిగ్ ఇన్ ఏ బుక్' అంశం తీసుకోబడింది. పుస్తకాల్లో దాగిన విజ్ఞాన వినోదాలను చిన్నారులు అర్థం చేసుకోవడానికి ప్రధాన ఉపకరణాలుగా బాలల పుస్తకాలు నిలుస్తున్నాయి. చిరుప్రాయంలోనే పిల్లలకు బాలల పుస్తకాలను అందుబాటులో ఉంచి, పఠనాసక్తిని జాగృత పరిచి, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి సర్వదా దోహదపడాలి. ఉపాధ్యాయుడు, విద్యార్థి, పుస్తకం, పెన్ను ఏకమైతే ప్రపంచ తలరాతను మార్చగల ఆయుధాలు అవుతాయని గుర్తుపెట్టుకోవాలి. నేటి బాలలు రేపటి బాధ్యతగల పౌరులుగా ఎదిగి, దేశాభివృద్ధికి దోహదపడటానికి ఏకైక మార్గం పుస్తక పఠన అలవాటు మాత్రమే అని తల్లితండ్రులు గమనించాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలి

హైదరాబాద్, ఏప్రిల్ 1: ఖైరతాబాద్ నియోజకవర్గంలో సీవరేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ జలమండలి అధికారులను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జలమండలి డివిజన్- 5 సీజీఎం ఆనంద్ నాయక్, జనరల్ మేనేజర్లు సంతోష్, సుబ్బారాయుడు, డీజీఎం మహేందర్‌రెడ్డితో పాటు డివిజన్-6 సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం శ్రీనివాస్ తదితరులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మంత్రి కేటీఆర్ చొరవతో నిధులు మంజూరయ్యాయన్నారు.

హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీవరేజీ లైన్ల సామర్థ్యం పెంపు, మంచినీటి లైన్ కోసం నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ జరుగుతోందని, త్వరలోనే బస్తీలు, కాలనీల వారీగా పర్యటించి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే దానం ఆదేశించారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ 18బస్తీలతో పాటు ఇందిరానగర్, గాయత్రీ హిల్స్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 46 అంబేద్కర్ నగర్ బస్తీ తదితర ప్రాంతాల్లో మొత్తం రూ. 3 కోట్లతో చేపట్టనున్న పనులను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే దానం తెలిపారు. అందుకుగాను పనులను వేగంగా ప్రారంభించేందుకు షార్ట్ టెండర్లను పిలిచి వేసవిలోగా పనులన్నీ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు : రఘునందన్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 1:తనపై దాడికి యత్నించిన వారిపై ఇంత వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ దుబ్బాకలో మినీ కూరగాయల మార్కెట్ ప్రారంభానికి వెళ్తే టీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని, బందోబస్తు కల్పించాలని ఫోన్ చేసి అడిగినా సిద్దిపేట ఏసీపీ పట్టించుకోలేదని టీఆర్ఎస్ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై తమ పార్టీకి చెందిన మహిళలు తిరుగుబాటు చేశారని చెప్పారు. తనపై భౌతికదాడి చేసేందుకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోలేదని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ సమావేశాల్లో ఇతర పార్టీల నేతలు ఆందోళన చేస్తే పోలీసులు ఊరుకుంటారా ? అని ప్రశ్నించారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో తానుంటే? స్టేషన్ బయట టీఆర్ఎస్ నేతలతో ఏసీపీ సంప్రదింపులు జరిపారని రఘునందన్ రావు మండిపడ్డారు. శిలాఫలకాన్ని కూల్చిన వ్యక్తులను ఇంత వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.

# మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ



కరీంనగర్ , ఏప్రిల్ 1: (నేటినిజం ప్రతినిధి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకుని తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, అదే స్ఫూర్తితో బంగారు తెలంగాణ నిర్మించుకుందామని మంత్రి కొప్పుల అన్నారు. రజాకర్లకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మను ఉక్కు మహిళ అని పేర్కొన్నారు. తెలంగాణ మట్టిలోనే పోరాటముందని, అందుకు చాకలి ఐలమ్మ జీవితం గొప్ప నిదర్శనం అని మంత్రి కొప్పుల కొనియాడారు.

# గుండ్ల బ్రహ్మేశ్వరంలో చిరుత పులి మృతి.. పెద్దపులి, చిరుత మధ్య కొట్లాట

అమరావతి, ఏప్రిల్ 1:మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతం గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్ పరిధిలో చిరుత పులి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్‌లోని ముస్తఫా రస్తా సెంట్రల్ నల్లమల రోడ్డు సమీపంలో ఈ ఘటన జరిగినట్లు గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్ ఇన్‌ఛార్జి రేంజర్ నాసిర్ జాహ్ తెలిపారు.

మంగళవారం మధ్యాహ్నం సమయంలో అక్కడ పెద్దపులి, చిరుత పులి మధ్య ఘర్షణ జరిగినట్లు చెప్పారు. ఈ ఘర్షణలో పెద్దపులి చిరుత పులి పై దాడి చేసి చిరుత పులిని ఎక్కడపడితే అక్కడ కొరకడంతో చిరుత మృతి చెందినట్లు రెంజర్ తెలిపారు. చిరుత పులిపై పెద్దపులి దాడి చేసిన గాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రెంజర్ స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న నంద్యాల డిఎఫ్‌వో వినీత్ కుమార్, ఇతర అటవీ అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత పులి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు.

అనంతరం వెలుగోడు మండలం మోతుకూరు పశువైద్యాధికారి సుధాకర్ రెడ్డి, నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ వైద్యాధికారులు జుబేర్‌లు మృతి చెందిన చిరుతకు పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేసినట్లు- రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్య సభ నుంచి రిటైర్ అవుతున్న సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 31:రాజ్య సభ లో రిటైర్ అవుతున్న సభ్యులంతా అందించినటువంటి తోడ్పాటుల కు గాను వారిని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రశంసిస్తూ, వారు రాబోయే కాలం లో బాగుండాలి అనే ఆకాంక్ష ను వ్యక్తం చేశారు. రిటైర్ అవుతున్న సభ్యుల అనుభవం యొక్క విలువ ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, వారి నిష్క్రమణ తో సభ లో మిగిలిన సభ్యుల బాధ్యత అధికం అవుతుంది, మరి వారు బయట కు వెళుతున్న సభ్యులు చేసిన కృషి ని ముందుకు తీసుకు పోవలసి ఉంటుంది అని ప్రధాన మంత్రి అన్నారు.

సభ దేశం లోని అన్ని ప్రాంతాల భావోద్వేగాల ను, ఉత్సాహాన్ని, వ్యథ ను, ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఒక సభ్యుడు లేదా ఒక సభ్యురాలు గా మనం సభ కు ఎంతో తోడ్పాటు ను అందిస్తాం, అయితే సభ కూడా మనకు ఎంతో ఇస్తుంది అనేది కూడా యదార్థమే ఎలాగంటే సభ ప్రతి రోజూ భారతదేశం లోని విభిన్న స్వరూపాలతో కూడిన సమాజం తాలూకు వర్తమాన వ్యవస్థల ను అర్థ: చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తుంది అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

కొంత మంది సభ్యులు సభ ను వీడి వెళుతున్నప్పటి కీ వారు వారి యొక్క ఘనమైన అనుభవాన్ని దేశం లో అన్ని మూలల కు తీసుకు పోతారు అని ప్రధాన మంత్రి అన్నారు.

సభ్యులు వారి జ్ఞాపకాల ను భావి తరాల వారికి ఉపయోగకరమైనటువంటి పరిశీలనాంశం గా అక్షరబద్ధం చేయాలి అని కూడా ప్రధాన మంత్రి సూచించారు. సభ్యులు దేశాని కి దిశ ను ఇచ్చి దానిని ప్రభావితం చేస్తారని, వారి స్మృతుల ను ఒక సంస్థాగతమైన పద్ధతి లో దేశం అభివృద్ధి కోసం వినియోగించుకోవచ్చని ఆయన అన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' ను జరుపుకోవడం లో ప్రజల కు ప్రేరణ ను కలిగించండి అంటూ రిటైర్ అవుతున్న సభ్యుల ను ప్రధాన మంత్రి అభ్యర్థించారు.

# ఉద్దేమర్రిలో గొర్రెల పంపిణీకి మంత్రి మల్లారెడ్డి శ్రీకారం



రంగారెడ్డి, ఏప్రిల్ 1:రంగారెడ్డి జిల్లాలో శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలో ముదుచింతలపల్లి మండలంలో ఉద్దేమర్రి గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ గొర్రెల అభివృద్ధి పథకం (ఎస్ఆర్డీపీ) లో భాగంగా గొర్రెల యూనిట్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. రాష్ట్ర ఎస్ఆర్డీపీ చైర్మన్ దుదిమెట్ల బాలరాజు యాదవ్, తెరాస పార్టీ కార్యదర్శి జహంగీర్, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, డీసీఎంస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీపీలు ఎల్లుబాయ్ బాబు, హారిక మురళీ గౌడ్, జడ్పీటీసీ అనిత, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కృష్ణ రెడ్డి, జిల్లా కో అప్షన్ సభ్యులు జహీర్, ఎంపీటీసీలు, సర్పంచ్లు, కో అప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు.. కృష్ణా జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సేంద్రియ సేద్యం



అమరావతి, ఏప్రిల్ 1: కృష్ణా జిల్లా మెట్టప్రాంతంలో నూతనంగా సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు సత్ఫలితాలు ఇస్తుందని అమెరికా ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఎ.పి.టి.ఎ) కార్యదర్శి కేలం ధనలక్ష్మి అన్నారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలో హనుమాన్ డ్రాగన్ ఫ్రూట్ ఫార్మ్ ఆధ్వర్యంలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగును ఆమె నేతృత్వంలోని రాష్ట్రంలోని 13జిల్లాల ప్రతినిధి బృందం పరిశీలించింది. డ్రాగన్ ఫ్రూట్ సాగును పద్దతులను, మార్కెటింగ్ వివరాలను తెలుసుకుని బృందంలోని సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. అమెరికా ఎన్ఆర్ఐ ల భాగస్వామ్యంతో స్థాపించిన అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ గత 14 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు 3 కోట్ల రూపాయల స్కాలర్ షిప్ లు ఇవ్వటంతో పాటు- మన దేశం నుంచి అమెరికా కు వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు వసతి, ఏ యూనివర్సిటీలో జాయిన్ అవ్వాలి.. ఏయే కోర్సులు ఎంచుకోవాలి..ఉద్యోగ,ఉపాధి అవకాశాల కోసం శిక్షణ తదితర సేవలందిస్తున్నట్లు తెలిపారు.

దీనిలో భాగంగానే మొట్టమొదటి సారిగా రైతుల కోసం ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో రైతు ఎక్కువ ఆదాయం పొందేలా సాంప్రదాయ పంటలకు భిన్నంగా వ్యవసాయంలో కొత్త పంటలు, ఆధునిక పద్ధతులు, మెళుకువలు తెలియచేసే ప్రయత్నంలో భాగంగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. కృష్ణాజిల్లా నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలో అన్నే పద్మావతి ఆధ్వర్యంలో పూర్తి సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న వివిధ పంటలతో పాటు బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని పూర్తి సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తున్న హనుమాన్ డ్రాగన్ ఫ్రూట్ ఫార్మ్ ను సందర్శించి ఆధునిక పంట డ్రాగన్ ఫ్రూట్ సాగు పరిశీలించినట్టు తెలిపారు.

ఈ సందర్భంగా రైతులకు లాభదాయకంగా ఉండే ఎన్. ఎం.కె వన్ గోల్డ్ రకం సీతాఫలం పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించినట్టు వెల్లడించారు. తక్కువ నీటి లభ్యత గల ప్రాంతాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం ద్వారా ఎలాంటి పంటలు సాగుచేసుకోవాలి.. పండించిన పంటను సొంతంగా మార్కెటింగ్ ఎలా చేసుకోవాలనే విషయాలపై పూర్తి అవగాహన కల్పించారు.. అనంతరం నూతనంగా మార్కెట్ లోకి వచ్చిన స్వరాజ్ కంపెనీ వారి కోడ్ మినీ ట్రాక్టర్ పనితీరును పరిశీలించినట్టు తెలిపారు. ఈ సంవత్సరం కేరళలోని కొబ్బరి రైతులతోనూ, పంజాబ్ లో వరి పండించే రైతులతోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

# ఎగుమతులు పెరగాలి.. పెరిగిన సేద్యం ఖర్చులు .. పెరగని ధాన్యం ధరలు

అమరావతి, ఏప్రిల్ 1:దేశంలో గత కొంతకాలంగా ఆహార ధాన్యాలకు కొరత లేదు. దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ రుతుపవనాలైతేనేమి, వర్షాలు అయితేనేమి, సరైన సమయంలోనే స్పందిస్తుండడంతో రైతులకు నీటి ఇబ్బంది తక్కువగానే ఉంది. దీంతో 2017 -18లతో పోలిస్తే 2019, 2020, 2021, ప్రస్తుతం 2022లో కూడా నీటి లభ్యత ఎక్కువగానే ఉండడంతో దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ ధాన్యం దిగుబడులు అధికంగానే ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి కూడా ఇదే పరిస్థితి ఏర్పడి ఉంది. గత సంవత్సరం అత్యంత సమర్థవంతంగా ఎటువంటి విమర్శలు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగానే నడిచింది. చిన్న చిన్న అంతరాయాలు మినహాయించి రైతులు కూడా సంతోషంగానే ధాన్యం అమ్మకాలు చేసుకోగలిగారు. ఈ ప్రక్రియలో ఆర్‌బీకేలు, మిల్లర్లు సమన్వయంగా ముందుకు సాగారు.

ఈ సంవత్సరం రైతులకు అనుకున్నంత రీతిలో మద్దతు ధర అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పుట్టి రూ. 16800 ఏ ఒక్క రైతన్నకు కూడా చెందలేదు. భారీ వర్షాల కారణంగా జిల్లా సీజన్‌లో చాలా మార్పులు జరగడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకమునుపే మార్కెట్‌లోకి ప్రవేశించిన మిల్లర్లు , దళారులు ధాన్యం ధరను అస్తవ్యస్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రకరకాల నిబంధనలతో అమ్ముకోవాల్సి వస్తుందంటూ రైతులకు మాయమాటలు చెప్పి, వడ్డీ లెక్కలతో ఆలస్యం చేస్తే మీకు నష్టమవుతుందంటూ నమ్మించి తక్కువ ధరకే కొనుగోలు ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటై పని ప్రారంభించే లోపే మిల్లర్ల దోపిడీ ప్రారంభం అయిపోయింది.

గత సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకున్న రైతులకు ఆలస్యంగా నగదు చేరిన సంఘటనలు కూడా రైతులు మిల్లర్ల వైపు మొగ్గు చూపేలా చేశాయి. కళ్ల ముందు కట్టాల్సిన అప్పు, వడ్డీలు కదలాడుతుండడంతో వారు కొంచెం ధర తగ్గినా పర్వాలేదు అనుకుంటూ మిల్లర్ల వైపే మొగ్గు చూపారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిబంధనల్లో కూడా సడలింపు అవసరమని రైతులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నెమ్ము శాతం విషయంలో మరికొంత సవరణలు చేయాలని , లేని పక్షంలో తమకు నష్టం జరుగుతుందని వారు వాదిస్తున్నారు. పేరుకు పుట్టి 850 కేజీలైనా కూడా మిల్లర్లు నెమ్ము శా తం పేరుతో తమ వద్ద 1000 కేజీలకు పైగా ధాన్యాన్ని తీసుకుంటున్నారని , ఈ విషయంలో వ్యవసాయ అధికారుల జోక్యం తక్కువగా ఉండడంతో తమకు నష్టమే జరిగిందన్నది రైతుల వాదన .

జిల్లాకు సంబంధించి కృష్ణపట్నం ఓడరేవు గుండా బియ్యం ఎగుమతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా శ్రీలంక , ఆఫ్రికా దేశాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతున్నాయి . భారత ఆహార విధానం ప్రకారం పాత కాలపు పద్ధతులే ఇప్పటికి కూడా ఎగుమతుల విధానంలో అవలంభిస్తున్నారు. ఈ విషయంలో పలు మార్పులు జరగాల్సి ఉంది. వర్షపాతాన్ని బట్టి సాగుచేసే నేల నిర్ణయం అనేది ముందస్తుగా తెలుస్తుంది. అలాగే ఎంత మేరకు ధాన్యం దిగుబడి రానున్నది అన్నది కూడా రెండు నెలల ముందుగానే తెలుస్తుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం , ప్రజా ప్రతినిధులు మరింత చొరవ తీసుకుని ఎగుమతుల విధానంలో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకతపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. ఈ మార్పు, చేర్పులు ప్రతి సీజన్‌లో అంచనా వేసిన ధాన్యం దిగుబడి ప్రకారం జరిగినప్పుడు రైతులకు , మిల్లర్లకు, ఎగుమతి దారులకు కూడా మరింత మంచి జరగడంతో పాటు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తగ్గడమే కాకుండా ఓడరేవు ద్వారా ఎగుమతుల వలన కేంద్ర ప్రభుత్వానికి మరింత సెస్ లభించే అవకాశం కూడా కలుగుతోంది.

# సర్కారు వైద్యం పేదలకు చేరువ..



హైదరాబాద్, ఏప్రిల్ 1: తెలంగాణ ప్రభుత్వం పేదలకు వైద్యాన్ని చేరువ చేస్తోందని ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం చైతన్యపురి డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో ,నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధిలోని ఫతుల్లాగూడ సర్వేనం. 58, 59లో బస్తీ దవాఖానల నిర్మాణానికి కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్త,అరుణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో అధునాతన సౌకర్యాలను కల్పించడంతో పాటు గా బస్తీల్లోకే వైద్య సేవలను తీసుకుని వచ్చి బస్తీ దవాఖానలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదన్నారు.

పేదలకు అన్ని రకాలైన వైద్య పరీక్షలు ఉచితంగా అందించేందుకు బస్తీ దవాఖానలు ఉపయోగపడుతాయన్నారు. నియోజకవర్గ ప్రజలకు త్వరలోనే అధునాతన మల్టీస్పెషాలిటీ దవాఖాన కూడా అందుబాటులోకి రానున్నదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేశ్ యాదవ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్‌యాదవ్, నాగలక్ష్మి, జ్యోతి, జయశ్రీ, వెంకటేశ్, నరేశ్, హరిబాబు, మోహన్‌రాజ్, చిన్నా యాదవ్, నజీర్ , శ్రీహరి, జలందర్, ఉదయ్, కృష్ణ, శ్రీనివాస్, శ్రీశైలం, బండ్లగూడ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, కృష్ణ,జంగయ్య గౌడ్, శ్యామల యాదగిరి, పెద్దులు, రాఘవేందర్ గౌడ్, సీతారాములు, కవిత, సుశీల, రంగేశ్వరి, పారిజాత, ఎల్లయ్య, శంకర్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

హైదరాబాద్, ఏప్రిల్ 1: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 'మన ఊరు, మన బడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మన బస్తీ, మన బడి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 9.5లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మంజూరైన నిధులతో పాఠశాలలో కావాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆహారం, ఆటవస్తువులు ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ సంగీత, ఎంఈవో రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్‌గౌడ్, హెచ్ఎం సుహాసిని, నాయకులు సుభాశ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, కొమురయ్య, చిన్న, నరేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాలో దారుణం.. తిరుణాలలో అగ్నిప్రమాదం

అమరావతి, ఏప్రిల్ 1:ప్రకాశం జిల్లాలో దారుణం జరిగింది. కొండపి మండలంలోని జాళ్లపాలెం గ్రామంలో కొత్తపల్లి వీరబ్రహ్మేంద్రస్వామి (ఉగాది) తిరునాళ్ల జరుగుతున్నాయి. ఈ సందర్భంగా టెంట్లు వేసి తారజువ్వాలు కాల్చడంతో టెంట్లపై నిప్పు రవ్వలు పడ్డాయి.

దీంతో టెంట్లు కింద ఉన్న 4 బైక్ లు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చెరుకోని మంటలను ఆర్పేశారు. వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఆ ప్రాంతంలో ఎద్ద ఎత్తున తారా జువ్వలు కాల్చడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది. ఈ రోజు రాత్రికి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే తిరుణాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. అటువంటి సమయంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు. అయితే అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఈదురు గాలులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చర్చించుకుంటున్నారు.

సాహితీ కిరణం
విడదల నీహారిక ఫౌండేషన్
శ్రీకార్తీక డెవలపర్స్
ఆహ్వానం
శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాలు
పంచాంగ శ్రవణం & ఉగాది కవిసమ్మేళనం
శ్రీమతి రామరాజు లక్ష్మీ శ్రీనివాసరావు వీణావాదన
కవితలు, కథలపోటీ విజేతలకు బహుమతి ప్రదానం
శ్రీమతి కుమ్మమూరి సుబ్బాయమ్మ రచించిన 'ఎదురీత' నవల ఆవిష్కరణ
సభాకార్యక్రమం
ముఖ్య అతిథి: శ్రీ మోదుగుల వేణుగోపాల రెడ్డి (పూర్వ పార్లమెంటు సభ్యులు)
సభాధ్యక్షులు: శ్రీ రమణవెలమకన్ని (కవి, రచయిత, విమర్శకులు)
విశిష్ట అతిథి: డా॥రామరాజు శ్రీనివాసరావు (చైర్మన్ రామరాజు ఫౌండేషన్, గుంటూరు)
గౌరవ అతిథి: శ్రీ బ్రహ్మారెడ్డి (స్థానిక కార్పొరేటర్)
ఆత్మీయ అతిథులు: శ్రీ తూములూరి రాజేంద్రప్రసాద్ (సాహితీకిరణం సలహాదారులు)
డా॥ముక్కెన శ్రీను (అధ్యక్షులు,ముక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్)
శ్రీ వడలి రాధాకృష్ణ (కవి, రచయిత)
శ్రీ ఎస్వీ. రఘువీర్ ప్రతాప్ (కవి, రచయిత)
సభాప్రారంభకులు: శ్రీ పొత్తూరి సుబ్బారావు (సంపాదకులు సాహితీకిరణం)
కవిసమ్మేళనం& కార్యక్రమ నిర్వహణ: శ్రీ పెద్దూరి వెంకటదాసు (సలహాదారులు సాహితీకిరణం)
పురస్కార ప్రదాతలు
శ్రీ సిరిగాద శంకర్-కవి, రచయిత
శ్రీ జన్నాభట్ల నరసింహప్రసాద్-కవి, రచయిత
శ్రీ విడదల సాంబశివరావు-అధ్యక్షులు విడదల నీహారిక ఫౌండేషన్
వి.వి.రాఘవరెడ్డి-మేనేజింగ్ డైరెక్టర్ కార్తీక డెవలపర్స్
తేది.05.04.2022న మంగళవారం ఉ॥10.30గం॥లకు వేదిక: సాహితీకిరణం బ్రాంచ్ కార్యాలయం
ఇం.నెం.107-1-331, వార్డు సచివాలయం ఎదురుగా, పొత్తూరు, గుంటూరు.
సాహితీకిరణం
పొత్తూరి జయలక్ష్మి
మేనేజర్

# రాబోయే రోజుల్లో ఇతర వర్గాలకు 'దళితబంధు': హరీష్‌రావు

సంగారెడ్డి, ఏప్రిల్ 1:: దళిత బంధును రాబోయే రోజుల్లో ఇతర వర్గాలకు విస్తరిస్తామని ఆర్థిక మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులో దళితబంధు పథకం లబ్ధిదారులకు మంత్రి యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...దళితబంధు ఓ సామాజిక ఉద్యమమన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.17800 కోట్లు దళితబంధు కోసం కేటాయించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 2 లక్షల మందికి దళిత బంధు అందిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ రేటు పెంచి.. సబ్సిడీ తగ్గించారని మండిపడ్డారు. ఎన్నికలు అయిపోగానే పెట్రోల్ ధరలు పెంచుతున్నారన్నారు. బీజేపీ వాళ్ల మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ అని మంత్రి విమర్శించారు.

మోదీ సొంత రాష్ట్రంలో పరిశ్రమలకు వారానికి ఒక రోజు పవర్ హాలిడే విధించారన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7778 మెగా వాట్ల ఉత్పత్తి ఉండేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన మొదటి రోజు నుంచి కష్టపడి ప్రస్తుతం 17305 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకున్నామని చెప్పారు. త్వరలో 4000 మెగా వాట్లతో యాదాద్రి పవర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఆరు నెలల్లో 1600 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అందుబాటులో వస్తుందన్నారు. మార్చి నెలలో 1200 కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్ కొనుగోలు చేశామని అన్నారు. 20 రూపాయలకు ఒక యూనిట్ చొప్పున కొనుగోలు చేసి ప్రజలకు అందిస్తున్నామని వెల్లడించారు. దేశం మొత్తం కరెంట్ కోతల్లో ఉంటే.. తెలంగాణ విద్యుత్ వెలుగుల్లో ఉందన్నారు. దేశంలో విద్యుత్ కోతలకు కేంద్రం వైఖరే కారణమని ఆగ్రహించారు. దేశం అవసరానికి మించి విద్యుత్ అందుబాటులో ఉన్నా.. సరైన పంపిణీ వ్యవస్థ లేక కోతలు విధిస్తున్నారని మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు.

## జర్నీస్ డీ లా ఫ్రాంకోఫోనీ 2022ను నిర్వహించిన మహీంద్రా యూనివర్శిటీ



హైదరాబాద్, ఏప్రిల్ 1:భారతదేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ లలో ఒకటైన మహీంద్రా యూనివర్శిటీ తమ మొట్టమొదటి ఫ్రాంకోఫోనీ డే ను జర్నీస్ డీ లా ఫ్రాంకోఫోనీ 2022 శీర్షికన 22 మార్చి నుంచి 24 మార్చి 2022 వరకూ నిర్వహించింది. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని ఫ్రెంచ్ భాష మరియు సంస్కృతి యొక్క ఏకీకృత స్ఫూర్తిని జరుపుకోవడానికి నిర్వహించారు. దీనిని ప్రొఫెసర్ గెరార్డ్ క్రూజెట్ నేతృత్వంలోని డెలెగ్ జనరల్ ద్యు గ్రూప్ డెస్ ఎకోల్స్ సెంట్రల్ కు చెందిన సెంట్రల్ సుపెలెక్ యొక్క విజిటింగ్ లీడర్‌షిప్ బృందం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మహీంద్రా యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ యజ్ మెద్యురీ తో పాటుగా హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ డీన్స్ మరియు హెడ్స్ పాల్గొన్నారు. "ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 300 మిలియన్ల మంది ఫ్రెంచ్ మాట్లాడే వ్యక్తులు ఉన్నారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో ఫ్రెంచ్ ఒకటి. ఈ కార్యక్రమం ఫ్రెంచ్ భాష మరియు సంస్కృతి ఏకీకృత స్ఫూర్తికి నిదర్శనం" అని డాక్టర్ యజ్ మెద్యురీ, వైస్ ఛాన్స్‌లర్, మహీంద్రా యూనివర్శిటీ అన్నారు.ఈ మూడు రోజుల కార్యక్రమంలో ఆసక్తి కలిగిన విద్యార్థులు పోటీపడటంతో పాటుగా పోస్టర్ మేకింగ్ , కరవొకె , కవిత్య పఠనం, క్విజ్ పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిశాయి.

## మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి:: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 1:(నేటినిజం ప్రతినిధి):అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా నాటిన మొక్కలన్నీ సంరక్షించేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల బైపాస్ రోడ్, వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి, శాత్రాజుపల్లి గ్రామాల పరిధిలోని రోడ్లకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ ను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు వంద శాతం బ్రతికేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. చనిపోయిన, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. వేసవి దృష్ట్యా మొక్కలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం, క్రమం తప్పకుండా నీటిని అందించాలని అన్నారు. మొక్కలకు సాసరింగ్ చేయాలని, ట్రీ గార్డులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. మొక్కలను సంరక్షించడంలో అలసత్వం వహిస్తే, చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ సందర్భంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, శ్యామ్ సుందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు- జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, ఏప్రిల్ 1 (నేటి నిజం ప్రతినిధి) శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది జిల్లా ప్రజలందరి జీవితాల్లో ఆనందం నింపాలని, జీవన సారాన్ని సూచించే షడ్రుచుల సమ్మేళితపు ఉగాది వచ్చడి ఆస్వాదించాలని, అందరూ సుఖశాంతులతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ నూతన తెలుగు సంవత్సరాది అందరి జీవితాల్లో ఆనంద వెలుగులు నింపాలని, ఎలాంటి సమస్యలు లేకుండా ఆయురారోగ్యాలతో బాగుండాలని, అన్నింటా విజయాలతో మరింత ఉన్నతంగా ఎదగాలని కోరారు.

జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందంజలో దూసుకు పోయేలా అందరూ సహకరించాలని కోరారు.

ప్రజలందరూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై ఆర్ వో బి ఎగ్జిబిషన్‌ను సందర్శించిన గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ , కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ , కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. నేటి నుంచి మూడవ తేదీ వరకు ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార ,ప్రసార మంత్రిత్వ శాఖ రీజనల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్ వో బి) తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల పై ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. బ్రిటీష్ పాలనకు, అప్పటి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల పాత్రను ఈ ఎగ్జిబిషన్ ప్రధానంగా వివరిస్తుంది. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడటంలో కుమురం భీం వంటి అంతగా వెలుగు లోకి రాని అసామాన్య వీరుల పాత్రను కేంద్ర మంత్రి గవర్నర్ కు వివరించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ వంటి ఇతివృత్తాలతో సహా సుమారు 50 ప్యానెల్స్ ను ఎగ్జిబిషన్ లో ఉంచారు.

తరువాత కేంద్ర మంత్రి శ్రీ జి. కిష న్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, భారత దేశానికి స్వాతంత్ర్యం వ చ్చి 75 సంవ త్స రాలుపూర్తయిన సంద ర్భంగా, మ న స్వాతంత్ర్య సమర యోధులు, ప్ర త్యేకించి అంతగా ప్రచారం పొందని వీరులు చేసిన త్యాగాలనుస్మరించుకొని యువతరానికి స్ఫూర్తిని అందించడం కోసం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమర యోధులపైప్రదర్శనలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ ను కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ, దీనిని ఘనంగా విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సాయంత్రం ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న మూడు రోజుల సాంస్కృతిక ఉత్సవంలో దేశంలోని అన్ని ప్రాంతాల నుండి సుమారు 1000 మంది కళాకారులు పాల్గొంటారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని - 'జనసేన' నిరసనలు




అమరావతి, ఏప్రిల్ 1:పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించింది జనసేన. ఏపీలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు జనసేన నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో భాగంగా పెంచిన విద్యుత్ చార్జీలను బాదుడే బాదుడు జనసేన శ్రేణులు పెద్ద పెట్టున నినాదాలు చేశాయి. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ రాజమహేంద్రవరంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు జరిగిన నిరసనల్లో పాలుపంచుకున్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించేదాకా తమ నిరసనలను కొనసాగిస్తామని ఆయన ప్రకటించారు. విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జనసేన తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పిన నాదెండ్ల..ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే దాకా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో పోరాటం సాగిస్తామన్నారు.

# మీతో ముచ్చటిస్తున్న సందర్భంగా నా జీవితాన్ని మలచుకునే ప్రయత్నం చేస్తాను..:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ "పక్షలపై ఇష్టాగోష్ఠి–2022" (పరీక్షా పే చర్చ–పీపీసీ) 5వ సంచికలో భాగంగా న్యూఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సంభాషించారు. ఈ ఆన్‌లైన్ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద విద్యార్థులు రూపొందించిన వస్తుప్రదర్శనను ఆయన తిలకించారు. కేంద్ర మంత్రులు శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, శ్రీమతి అన్నపూర్ణా దేవి, డాక్టర్ సుభాస్ సర్కార్, డాక్టర్ రాజ్‌కుమార్ రంజన్ సింగ్, శ్రీ రాజీవ్ చంద్రశేఖర్‌లతోపాటు వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులుసహా వారి తల్లిదండ్రులు ఇందులో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమం ఆసాంతం ప్రధానమంత్రి వారితో మమేకమవుతూ ఉల్లాసంగా, సంభాషణ రూపాన్ని కొనసాగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– నిరుడు ఇదే కార్యక్రమంలో యువమిత్రులను కలుసుకున్న తర్వాత మళ్లీ ఇవాళ వారితో సమావేశం కావడం ఎంతో ఆనందం కలిగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తనకెంతో ఇష్టమైనదని ప్రధాని అన్నారు. రేపు విక్రమనామ సంవత్సరారంభం (ఉగాది) కావడంతోపాటు రాబోయే మరిన్ని పండుగలను పురస్కరించుకుని విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'పీపీసీ' 5వ సంచికలో కొత్త సంప్రదాయానికి ప్రధానమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సమయాభావం వల్ల తాను స్వీకరించలేని ప్రశ్నలకు 'నమో' యాప్‌ద్వారా వీడియో, ఆడియో లేదా వచన సందేశాల రూపంలో జవాబిస్తానని ఆయన ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ముందుగా పరీక్షలకు సంబంధించి ఆందోళన, ఒత్తిడులపై ఢిల్లీ నగర విద్యార్థి ఖుషీ జైన్ నుంచి తొలి ప్రశ్నరాగా– ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌నుంచి వడోదరకు చెందిన కినీ పటేల్ కూడా అదే ప్రశ్న వేశారు. అయితే, ఇలాంటి పరీక్షలు రాయడం వారికిది తొలిసారి కాదు కాబట్టి "ఒకవిధంగా మీరు పరీక్షాతీతులు" అంటూ– ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదని ప్రధాని వారికి సూచించారు. మునుపటి పరీక్షల అనుభవం రాబోయే పరీక్షల ఒత్తిడిని అధిగమించడంలో తోడ్పడగలదని చెప్పారు. కొంత భాగం చదవలేని పరిస్థితి ఏర్పడినప్పటికీ దానిపై ఆందోళన చెందవద్దని చెప్పారు. తమ సంసిద్ధత బలంపై విశ్వాసంతో నింపాదిగా, రోజువారీ కార్యకలాపాల్లో నిమగ్నం కావాల్సిందిగా సలహా ఇచ్చారు. ఇతరులను అనుకరించడం వంటి ప్రయత్నాలు చేయకుండా తమ దైనందిన కార్యక్రమాలు, చదువు సంగతి చూసుకుంటూనే పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు.

కర్ణాటకలోని మైసూరు విద్యార్థి తరుణ్ రెండో ప్రశ్నను సంధించాడు. 'యూట్యూబ్' వంటి అనేక ఆకర్షణల నడుమ ఆన్‌లైన్‌లో అధ్యయనం ఎలాగని అతను అడిగాడు. అలాగే ఢిల్లీ నుంచి షాహిద్ అలీ, కేరళలోని తిరువనంతపురం నుంచి కీర్తన, తమిళనాడులోని కృష్ణగిరి నుంచి ఉపాధ్యాయుడు చంద్రచూడేశ్వరన్ కూడా ఇదే ప్రశ్న సంధించారు. చదువు విషయంలో ఈ సమస్య ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులకు సంబంధించినది కాదని, ఆఫ్‌లైన్ చదువు విధానంలోనూ మనను పక్కకులాగే అంశాలుంటాయని ప్రధాని పేర్కొన్నారు. "సమస్య విధానంలో లేదు? మనసులోనే ఉంటుంది" అన్నారు. ఆన్‌లైన్‌లోనైనా, ఆఫ్‌లైన్ పద్ధతిలోనైనా మన ఏకాగ్రత చదువుపై ఉన్నపుడు ఇతరత్రా ఆటంకాలు దాన్ని చెదరగొట్టలేవని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం నిత్యం అభివృద్ధి చెందుతున్నదని, ఆ మేరకు విద్యాసంబంధిత కొత్త సాంకేతికతలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కొత్త అభ్యసన పద్ధతులను ఒక సవాలుగా కాకుండా అవకాశంగా పరిగణించాలని సూచించారు. విద్యార్థుల ఆఫ్‌లైన్ అధ్యయనానికి ఆన్‌లైన్ మరింత తోడ్పాటునిస్తుందన్నారు. ఆన్‌లైన్ అన్నది సమీకరణకు దోహదం చేస్తే, ఆఫ్‌లైన్ దాన్ని సమృద్ధం చేసి, కార్యసిద్ధికి తోడ్పడుతుందన్నారు. దీనికి సంబంధించి దోసె తయారీని ఆయన ఉదాహరిస్తూ– ఎలా చేయాలో ఆన్‌లైన్‌లో ఎవరైనా నేర్చుకోవచ్చు? కానీ, ప్రత్యక్షంగా చేస్తేనే అది కార్యరూపం దాలుస్తుందని వివరించారు. ఆన్‌లైన్ ప్రపంచ ఊహల్లో విహరించడం కాకుండా తమగురించి తాము ఆలోచిస్తూ తదనుగుణంగా నడచుకోవాలని సూచించారు.

హర్యానాలోని పానిపట్ నగర ఉపాధ్యాయిని సుమన్ రాణి మాట్లాడుతూ– కొత్త విద్యా విధానంలోని అంశాలు ప్రధానంగా విద్యార్థుల జీవితాలకు? మొత్తంగా సమాజానికి ఎలాంటి సాధికారతనిస్తాయి? నవ భారతానికి అవి బాటలు వేస్తాయా? అని ప్రశ్నించారు. అలాగే మేఘాలయలోని ఈస్ట్ ఖైలాస్ హిల్స్‌కు చెందిన శైలా కూడా ఇదే తరహా ప్రశ్నవేశారు. దీనిపై ప్రధానమంత్రి స్పందిస్తూ– ఇది "జాతీయ విద్యావిధానమే తప్ప 'కొత్త' విద్యావిధానం కాద"ని బదులిచ్చారు. దేశంలోని వివిధ భాగస్వాములతో 'రికార్డు స్థాయి' మేథోమథనం అనంతరం ఈ విధానం రూపుదిద్దుకున్నదని చెప్పారు. "జాతీయ విద్యావిధానంపై సమగ్ర సంప్రదింపులు సాగాయి? ఈ విషయంలో దేశవ్యాప్తంగా ప్రజలతో చర్చ నిర్వహించబడింది" అని వివరించారు. ఇది ప్రభుత్వం రూపుదిద్దిన విధానం కాదని, పౌరులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు దేశ ప్రగతి దిశగా దీనికి రూపమిచ్చారని పేర్కొన్నారు. లోగడ వ్యాయామ విద్య, శిక్షణ అదనపు పాఠ్యాంశాలుగా ఉండేవని గుర్తుచేశారు. అయితే, నేడు వాటిని విద్యలో భాగం చేసిన నేపథ్యంలో వాటికి ప్రాముఖ్యం మరింత పెరిగిందని చెప్పారు. మన 20వ శతాబ్దపు విద్యా విధానం, సంబంధిత ఆలోచనలు ప్రస్తుత 21వ శతాబ్దంలో దేశ ప్రగతి పథాన్ని నిర్ణయించలేవని ఆయన చెప్పారు. ఆ మేరకు కాలమాన పరిస్థితుల్లో మారుతున్న వ్యవస్థలతోపాటు మనమూ మారకపోతే పూర్తిగా వెనుకబడి, తిరోగమన పథంలోకి వెళ్లిపోతామని హెచ్చరించారు. విద్యార్థులు తమ స్వప్నాలను సాకారం చేసుకోవడానికి జాతీయ విద్యావిధానం అవకాశం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విజ్ఞానంతోపాటు నైపుణ్యానికిగల ప్రాముఖ్యాన్ని ఆయన నొక్కిచెప్పారు. అందుకే జాతీయ విద్యావిధానంలో నైపుణ్యాలు ఒక భాగంగా చేర్చబడ్డాయని తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఎంపిక చేసుకోవడంలో జాతీయ విద్యావిధానం ఎంతో వెసులుబాటు ఇస్తుందని వివరించారు. ఈ విధానాన్ని సవ్యంగా అమలు చేయగలిగితే కొత్త మార్గాలు తెరుచుకుంటాయని చెప్పారు. విద్యార్థులు ఆవిష్కరించిన సాంకేతికతలను ఉపయోగంలోకి తెచ్చేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని దేశంలోని పాఠశాలలన్నిటికీ ప్రధాని పిలుపునిచ్చారు.

ఉత్తరప్రదేశ్ లోని ఘజియాబాద్ కు చెందిన రోషిని, తమ కుటుంబ ఆకాంక్షలను నేరవేర్చడం గురించి, పరీక్షా ఫలితాల గురించి, తల్లిదండ్రులు కోరుతున్నట్టు విద్యను సీరియస్ గా తీసుకోవాలా లేక దీనిని ఒక పండుగ లా ఆనందించాలా అని ప్రశ్నించింది.

పంజాబ్ లోని భటిండాకు చెందిన కిరణ్ ప్రీత్ కౌర్ ఇలాంటి ప్రశ్ననేశారు. తమ కలలను విద్యార్థులపై రుద్దవద్దనితల్లిదండ్రులు , ఉపాధ్యాయులకు ప్రధానమంత్రి సూచించారు. తాము సాకారం చేసుకోలేక పోయిన కలలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై రుద్ద రాదని ప్రధానమంత్రి సూచించారు. ప్రతి విద్యార్థికి కొన్ని ప్రత్యేక సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ప్రధానమంత్రి సూచించారు. విద్యార్థులు తమబలమేమిటో గుర్తించి విశ్వాసంతో ముందుకు సాగిపోవాలని ప్రధానమంత్రి వారికి తెలియజేశారు.

మనకు మరిన్ని బ్యాక్‌లాగ్‌లు ఉన్నప్పుడు , ప్రేరణతో విజయం సాధించడం ఎలా అని ఢిల్లీకి చెందిన వైభవ్ కన్నౌజియా అడిగారు. ఒడిషాకు చెందిన ఒక విద్యార్థి తండ్రి సుజిత్ కుమార్ ప్రధాన్ , జైపూర్ కు చెందిన కోమల్‌శర్మ, తోహాకు చెందిన ఆరోన్ ఎబెన్‌లు ఇదే తరహాలో ప్రశ్నలు వేశారు. ఇందుకు బదులిస్తూ ప్రధానమంత్రి , "ప్రేరణ పొందడానికి ఫార్ములా కానీ ఇంజెక్షన్ కానీ ఏదీ లేదని అంటూ, మీ గురించి మీరు మరింతగా తెలుసుకోండి, మిమ్మల్ని ఏది సంతోషంగా ఉంచుతుందో గమనించండి. దానిపై కృషి చేయండి" అని సూచించారు. తమకు సహజంగా ప్రేరణనిచ్చే వాటిని గుర్తించాల్సిందిగా ప్రధానమంత్రి విద్యార్థులకుసూచించారు. ఇందులో ఎవరికి వారు స్వతంత్రంగా ఆలోచించాలని , తమ బాధలకు ఇతరులనుంచి సానుభూతి పొందేందుకు ప్రయత్నించరాదని అన్నారు.తమ చుట్టూ ఉన్న వారిని , దివ్యాంగులను గమనించి వారు తమ లక్ష్యాన్ని సాధించేందుకు సాగిస్తున్న కృషిని గమనించాలని ప్రధానమంత్రి విద్యార్థులను కోరారు. " మన చుట్టూ ఉన్న పరిసరాలను గమనించి అందులోని బలాలను, చుట్టుపక్కల వారి కృషిని గుర్తించి ప్రేరణ పొందాల"ని అన్నారు. తను రాసిన ఎగ్జామ్ వారియర్ పుస్తకాన్ని గుర్తుచేస్తూ ప్రధానమంత్రి, పరీక్షకే లేఖ రాయడం ద్వారా , తమ కున్న బలం, ముందస్తు సన్నద్ధతతో పరీక్షనే సవాలు చేయడంద్వారా ఎవరికి వారు ప్రేరణ పొందినట్టు ఎలా భావించవచ్చో ఆయన తెలియజేశారు.

తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం నుంచి అనూష మాట్లాడుతూ, ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటపుడు ఆయా అంశాలు తనకు అర్థమవుతాయని ,అయితే కాసేపు అయ్యాక వాటిని తాను మరచిపోతానని , ఈ సమస్యను ఎదుర్కోవడమెలా అని అడిగారు. నమో యాప్‌ద్వారా గాయత్రి సక్సేనా తన జ్ఞాపకశక్తి, అవగాహన పై ప్రశ్నవేశారు. ఇందుకు బదులిస్తూ ప్రధానమంత్రి, ఏకాగ్రతతో నేర్చుకుంటే ఏదీ మరిచిపోమని అన్నారు. విద్యార్థులు వర్తమానంలో పూర్తిస్థాయి ఎరుకతో ఉండాలని, వర్తమానం గురించిన ఎరుకవారికి మరింత నేర్చుకోవడానికి , గుర్తుంచుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. వర్తమానమే అతిపెద్ద వర్తమానమని, వర్తమానంలో జీవిస్తూ ,దానిని పూర్తిగా అర్థం చేసుకున్నవారు జీవితం నుంచి గరిష్ఠస్థాయిలో ప్రయోజనం పొందగలరని అన్నరాడు. జ్ఞాపకశక్తిని నిధిగాచేసుకోవడమే కాదు, దానిని మరింత విస్తృతపరుచుకోవాలని అన్నారు. స్థిరమైన మనస్సు విషయాలను బాగా జ్ఞాపకం పెట్టుకోవడానికి అనువైనదని ప్రధానమంత్రి తెలిపారు.

జార్ఖండ్ కు చెందిన శ్వేతా కుమారి మాట్లాడుతూ, తాను రాత్రి పూట చదవడానికి ఇష్టపడతానని అయితే పగటిపూట చదవాల్సిందిగా చెబుతుంటారని అన్నారు. నమో యాప్ నుంచి రాఘవ్ జోషి, చదువుకునేందుకు తగిన కాలపట్టిక గురించి అడిగారు. ప్రధానమంత్రి వీటికి బదులిస్తూ, ఎవరికి వారు తమ కృషికి వచ్చిన ఫలితాన్ని అంచనా వేసుకోవాలని, సమయం ఎ విధంగా వినియోగించామో గమనించాలని అన్నారు. ఇలా మన కృషి దాని ఫలితాన్ని అంచనా వేయడం విద్యలో ముఖ్యమైన అంశమని ఆయన అన్నారు.మనం చాలావరకు మనకు సులభమైన, ఆసక్తి కలిగించే సబ్జెక్టులపై ఎక్కువ సమయం కేటాయిస్తామని అన్నారు.

'మనస్సు, హృదయం ,శరీరాన్ని మోసం చేయడాన్ని' అధిగమించడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం అవసరం అని ఆయన అన్నారు. "మీరు ఆనందించే పనులు చేయండి ,గరిష్ఠఫలితాన్ని పొందుతారు", అన్నారాయన.

జమ్ముకాశ్మీర్ లోని ఉధంపూర్‌కుచెందిన ఎరికా జార్జ్ మాట్లాడుతూ, బాగా విజ్ఞానవంతులైన వారు ఏవో కారణాల వల్ల తగిన పరీక్షలకు హాజరుకాలేకపోవడం గురించి ప్రస్తావించారు. గౌతమ్ బుద్ధ నగర్‌కుచెందిన హరి ఓం మిశ్ర. పోటీ పరీక్షల ను ఎదుర్కోవడం గురించి, బోర్డు పరీక్షలకు సిద్ధం కావడం గురించి అడిగారు. ప్రధానమంత్రి ఇందుకు బదులిస్తూ పరీక్షల కోసమే చదవడం సరైనది కాదని అన్నారు. మనసుపెట్టి సిలబస్ ప్రకారం చదివితే ఏ రకమైన పరీక్ష అయినా కష్టం కాదని అన్నారు. పరీక్షలలో పాస్‌కావడంపై దృష్టితో కాకుండా ఆయా సబ్జెక్టులపై పట్టు పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులను ఆయా క్రీడలకు సిద్ధం చేస్తారు కాని పోటీ కోసం కాదని అన్నారు. "మీరు ఒక ప్రత్యేక తరం. నిజమే, పోటీ ఎక్కువ ఉంది. కానీ అవకాశాలు కూడా ఎక్కువే ఉన్నాయి" అని ప్రధానమంత్రి అన్నారు. పోటీ అనేది తమ కాలపు అద్భుత వరంగా భావించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

గుజరాత్ లోని నవ్‌సరాయ్‌కు చెందిన ఒక పేరెంట్ సీమా చేతన్ దేశాయ్ మాట్లాడుతూ, గ్రామీణ బాలికలను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు సమాజం ఏ రకంగా కృషిచేయవచ్చని అడిడారు. ఇందుకు బదులిస్తూ ప్రధానమంత్రి, గత కొన్నేళ్లుగా పరిస్థితులు మారాయని ఆయన అన్నారు. బాలికా విద్యను పట్టించుకోని కాలం నుంచి పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందని అన్నారు. బాలికలకు సరైన విద్య లేకుండా ఏ సమాజమూ మెరుగుపడలేదని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. బాలికల సాధికారత, వారికి అవకాశాలు సంస్థాగతం చేయాలని అన్నారు. బాలికలను ఎంతో విలువైన ఆస్తిగా మారుతున్నారు. ఈ మార్పు స్వాగతించదగినదని అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సంవత్సరంలో , స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే గరిష్ఠ స్థాయిలో మహిళా సభ్యులు ఉన్నారన్నారు. "కుమార్తె కుటుంబానికి బలం. వివిధ జీవన రంగాలలో అద్భుత నారీశక్తిని చూడడం కంటే మించినది ఏముంటుంది?" అని ప్రధానమంత్రి అన్నారు. ఢిల్లీకి చెందిన పవిత్ర రావు, మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కొత్తతరం ఏం చేయాలని అడిగారు. తన క్లాస్, పర్యావరణం పరిశుభ్రంగా హరితమయం కావాలంటే ఏం చేయాలని చైతన్య అడిగారు. విద్యార్థులను అభినందిస్తూ ప్రధానమంత్రి, దేశం పరిశుభ్రంగా, హరితమయం చేసేందుకు విద్యార్థుల కృషిని అభినందించారు. చిన్నారులు స్వచ్ఛతా ప్రతిజ్ఞను అర్థం చేసుకున్నారని ప్రధానమంత్రి అన్నారు. మన పూర్వీకుల కృషి కారణంగా మనం ఈ పర్యావరణాన్ని అనుభవిస్తున్నామని అంటూ ప్రధానమంత్రి, భవిష్యత్‌తరాలకు మనం అలాగే మెరుగైన పర్యావరణాన్ని అందించాలని అన్నారు.

# ఆసుపత్రి లిఫ్ట్ కూలి 9 మంది డాక్టర్లకు గాయాలు

ముంబయి, ఏప్రిల్ 1:ఆసుపత్రిలోని లిఫ్ట్ కూలి.. అందులోని 9 మంది వైద్యులు గాయపడిన ఘటన మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో చోటుచేసుకుంది. న్యూ పన్వెల్ నగరంలోని అమ్లే హాస్పిటల్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆసుపత్రి మూడో ఫ్లోర్‌లో కొందరు వైద్యులు భోజనం చేశారు. అనంతరం వారంతా గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరేందుకు లిఫ్ట్ ఎక్కారు. అయితే అది రెండో ఫ్లోర్‌కు చేరగా లిఫ్ట్ మెటల్ రోప్ తెగిపోయింది. దీంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వేగంగా పడిపోయింది. లిఫ్ట్ కూలిన సంఘటన గురించి తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది ఆ ప్రైవేట్ ఆసుపత్రికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో చిక్కుకున్న డాక్టర్లను కాపాడారు. తీవ్రంగా గాయపడిన 9 మంది వైద్యులను చికిత్స కోసం మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన డాక్టర్ల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు తెలిపారు.

# భారత్ విధానాలపై రష్యా మంత్రి లవ్‌రోవ్ ప్రశంసలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: భారత దేశ స్వతంత్ర విదేశాంగ విధానంపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్‌రోవ్ శుక్రవారం ప్రశంసలు కురిపించారు. తమ దేశం నుంచి ఏమైనా కొనాలని భారత్ కోరుకుంటే, తాము చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మన దేశ విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌తో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆయోదయోగ్యమైన సహకారంతమ దేశం నుంచి భారత్ ఏది కొనాలనుకున్నా, చర్చించడానికి, పరస్పర ఆమోదయోగ్యమైన సహకారాన్ని అందజేయడానికి తాము సిద్ధమేనని సెర్గీ లవ్‌రోవ్ తెలిపారు. భారత దేశ విదేశాంగ విధానాలు స్వతంత్ర లక్షణం కలవని, వీటి ప్రధాన దృష్టి వాస్తవ జాతీయ సముచిత ప్రయోజనాలపై ఉంటుందని అన్నారు. రష్యన్ ఫెడరేషన్ విధానం కూడా ఇదేనని చెప్పారు. పెద్ద దేశాలుగా తమను ఇదే మంచి మిత్రులుగా, నమ్మకమైన భాగస్వాములుగా చేస్తోందని తెలిపారు. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

అన్ని రంగాల్లో సహకారంభద్రతా సంబంధిత సవాళ్ళను ఎదుర్కొనడంలో భారత్‌కు ఏ విధంగా రష్యా సహాయపడుతుందని ప్రశ్నించినపుడు లవ్‌రోవ్ స్పందిస్తూ, అనేక దశాబ్దాల నుంచి భారత్‌తో ఏర్పరచుకున్న సంబంధాల స్వభావంతో చర్చలు జరుగుతాయన్నారు. సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యాలని, ఈ ప్రాతిపదికపైనే తాము అన్ని రంగాల్లోనూ తమ సహకారాన్ని వృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు.

ఇది యుద్ధం కాదురష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్నదానిని యుద్ధంగా విలేకర్లు పేర్కొనడంపై లవ్‌రోవ్ అభ్యంతరం తెలిపారు. "మీరు దీనిని యుద్ధం అని అంటున్నారు. అది నిజం కాదు. ఇది ఓ ప్రత్యేకమైన కార్యకలాపం. సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నాం. రష్యాకు ముప్పు కలిగించే సామర్థ్యం ఉక్రెయిన్‌కు లేకుండా చేయడమే మా లక్ష్యం" అని చెప్పారు.

ఒత్తిళ్లు పని చేయబోవుఅమెరికా, ఇతర దేశాల ఒత్తిళ్ళ ప్రభావం భారత్–రష్యా సంబంధాలపై ఉంటుందా? అని విలేకర్లు అడిగినపుడు లవ్‌రోవ్ స్పందిస్తూ, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని ఏ ఒత్తిడీ ప్రభావితం చేయబోదని, తనకు ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదని తెలిపారు. అమెరికాను ఉద్దేశించి మాట్లాడుతూ, వారు తమ రాజకీయాలను అనుసరించాలని ఇతరులను బలవంతపెడుతున్నారన్నారు.

భారత్ మధ్యవర్తిత్వాన్ని స్వాగతిస్తాంఉక్రెయిన్ సంక్షోభంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందా? అని ప్రశ్నించినపుడు లవ్‌రోవ్ మాట్లాడుతూ, భారత దేశం చాలా ముఖ్యమైన దేశమని చెప్పారు. ఓ పరిష్కారాన్ని అందించగలిగే పాత్రను భారత దేశం పోషిస్తే, అటువంటి ప్రక్రియకు మద్దతివ్వవచ్చునని తెలిపారు. తాము ఉక్రెయిన్ భద్రతకు హామీ ఇవ్వడానికి అనుకూలమేనన్నారు. పాశ్చాత్య దేశాలు తమ బాధ్యతను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు.

ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో పాశ్చాత్య దేశాలు రష్యాపై కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లవ్‌రోవ్ గురువారం భారత దేశ పర్యటనకు వచ్చారు. మన దేశ విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌తో సమావేశమయ్యారు. రష్యా నుంచి డిస్కౌంటెడ్ ఆయిల్‌ను భారత దేశం కొనబోతోందనే ప్రచారం నడుమ వీరి సమావేశం జరిగింది. ద్వైపాక్షిక వాణిజ్యం సజావుగా జరగడానికి వీలుగా రూపాయి–రూబుల్ పేమెంట్ విధానాన్ని అనుసరించాలని ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

ఇదిలావుండగా, అమెరికా డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ దలీప్ సింగ్ గురువారం మాట్లాడుతూ, అమెరికా ఆంక్షలను తుంగలో తొక్కే ప్రయత్నాలు చేసే దేశాలు పర్యవసానాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రష్యా నుంచి ఇంధనం, ఇతర ఉత్పత్తులను భారత దేశం వేగంగా దిగుమతి చేసుకోవడాన్ని చూడాలని కోరుకోవడం లేదన్నారు. అంతకుముందు ఆయన భారత దేశ మధ్యవర్తులతో సమావేశాలు నిర్వహించారు.

ఇదిలావుండగా, యుద్ధానికి ముందు ఉన్న ధరలో బ్యారెల్‌కు 35 డాలర్ల వరకు రాయితీతో హైగ్రేడ్ ఆయిల్‌ను ఇస్తామని రష్యా ప్రతిపాదించినట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది.

# భారీగా నగదు పట్టివేత

అమరావతి, ఏప్రిల్ 1:జిల్లాలోని కృష్ణవరం టోల్‌గేట్ దగ్గర పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భారీ మొత్తంలో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.5.06 కోట్ల నగదు, 10 కిలోల బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు.

పద్మావతి ట్రావెల్స్ బస్సులో నగదు, బంగారం తరలిస్తున్నారు. పద్మావతి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నగదు, బంగారాన్ని తరలిస్తుండగా వ్యక్తి పట్టుబడ్డాడు. ఎక్కడి నుంచి ఎక్కడకు తరలిస్తున్నారో పోలీసులు ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బు, బంగారాన్ని మీడియా ముందు పెద్దాపురం సర్కిల్ పోలీసులు ప్రదర్శించారు. నగదును పట్టుకున్న జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు, కిర్లంపూడి ఎస్సై తిరుపతిరావుని పెద్దాపురం డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.



